ధృతరాష్ట్ర కౌగిలిలా బీజేపీ స్నేహం

- ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు ఖతం
- తాజాగా గట్టి దెబ్బతిన్న పీడీపీ, జేజేపీ
- ఉనికి కోల్పోతున్న బీజేపీ పాత స్నేహితులు
- నమ్మి నట్టేట మునిగిన బీజేడీ, వైసీపీ



పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, జేజేపీ నాయకుడు దుష్యంత్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: భారతీయ జనతా పార్టీతో పొత్తు ప్రాంతీయ పార్టీలను ముంచేస్తున్నది. ఎన్డీఏలో చేరిన పార్టీల పరిస్థితి ధృతరాష్ట్ర కౌగిలిలోకి వెళ్తున్నట్టుగా మారింది. బీజేపీతో స్నేహం చేసినన్ని రోజులు బాగానే ఉంటుంది. ఒక్కసారి ఆ పార్టీకి కటీఫ్ చెప్పిన తర్వాత ప్రాంతీయ పార్టీల పుట్టి మునుగుతున్నది. శిరోమణి అకాలీదళ్, శివసేన(ఉద్ధవ్), అన్నా డీఎంకే పార్టీలతో మొదలుపెడితే తాజా ఎన్నికల్లో దారుణంగా ఓడిన పీడీపీ, జేజేపీ వరకు బీజేపీతో పొత్తు పెట్టుకొని దెబ్బతిన్న పార్టీలు చాలానే ఉన్నాయి. ఇక, పొత్తు లేకపోయినప్పటికీ బీజేపీతో సన్నిహితంగా మెలిగిన బీజేడీ, వైఎస్సార్సీపీ వంటి పార్టీలు కూడా మునిగిపోయాయి. దీంతో బీజేపీతో స్నేహం ఒక ఊబి లాంటిదని, ఒకసారి అడుగు పెట్టిన తర్వాత మునిగిపోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కోలుకోలేని విధంగా దెబ్బతిన్న పీడీపీ

2014లో జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో జమ్ము కశ్మీర్ పీపుల్స్ డెమాక్రటిక్ పార్టీ(పీడీపీ) 28 సీట్లు గెలిచి అతి పెద్ద పార్టీగా నిలిచింది. ఆ ఎన్నికల్లో ఎవరికీ మేజిక్ ఫిగర్ రాకపోవడంతో బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సహజంగా కశ్మీర్ ప్రాంతంలో పీడీపీ బలంగా ఉంటుంది. బీజేపీతో స్నేహం కశ్మీర్ ప్రజలకు పీడీపీని దూరం చేసింది. దీంతో తాజా ఎన్నికల్లో పీడీపీ 28 సీట్ల నుంచి మూడు సీట్లకు పడిపోయింది. ఈ ఓటమి నుంచి పీడీపీ ఇప్పట్లో తేరుకునే పరిస్థితి కనిపించడం లేదు.

జేజేపీ పని ఖతం

2019లో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మేజిక్ ఫిగర్ రాలేదు. దీంతో ఐఎన్ఎల్డీ నుంచి వేరుపడి ఏర్పడిన జన్‌నాయక్ జనతా పార్టీ(జేజేపీ) మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పుడే కొత్తగా పెట్టిన జేజేపీ ఆ ఎన్నికల్లో 10 స్థానాలు సాధించి కింగ్ మేకర్ అయ్యింది. నాలుగేండ్ల పాటు పొత్తు ప్రయాణం బాగానే సాగింది. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపిణీ కుదరక పొత్తు విచ్ఛిన్నమైంది. ఆ తర్వాత జేజేపీ నుంచి కొందరు నేతలను చేర్చుకొని ఆ పార్టీని బీజేపీ దెబ్బ తీసింది. 2019లో జేజేపీకి గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఆదరణ కనిపించింది. అయితే, రైతుల ఉద్యమం తర్వాత పరిస్థితి మారింది. బీజేపీతో కలిసి ఉన్న జేజేపీకి రైతులు దూరమయ్యారు. బలమైన రైతు ఓటు బ్యాంకు దూరమై ఈ ఎన్నికల్లో జేజేపీ దారుణంగా దెబ్బతిన్నది. ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది.

పాత మిత్రులూ మునిగిపోయారు

బీజేపీతో శివసేన పార్టీది దాదాపు మూడు దశాబ్దాల స్నేహం. అయితే, 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవి విషయంలో విభేదాలు తలెత్తాయి. బీజేపీకి దూరమైన శివసేన.. కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత శివసేనలో చిచ్చు రేగింది. ఆ పార్టీ నిలువునా చీలింది. బీజేపీ మద్దతుతో ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రి అయ్యారు. పాత మిత్రపక్షం అని కూడా చూడకుండా బీజేపీనే శివసేనలో చిచ్చు పెట్టిందనే విషయం బహిరంగ రహస్యమే. ఇక, ఉత్తరాది, హిందీ ఆధిపత్యాన్ని వ్యతిరేకించి తమిళనాడులో బీజేపీతో పొత్తు పెట్టుకున్న అన్నా డీఎంకే కూడా ఉనికి కోల్పోతున్నది. గత ఎన్నికల ముందు తమిళనాడులో బీజేపీ కొంత బలపడిందనే పరిస్థితులు కనిపించాయి. దీంతో అన్నాడీఎంకేతో సుదీర్ఘ స్నేహాన్ని ఏమాత్రం మొహమాటం లేకుండా బీజేపీ వదులుకొని ఒంటరిగా పోటీ చేసింది. బీజేపీకి సుదీర్ఘకాలం మిత్రపక్షంగా ఉన్న శిరోమణి అకాలీదళ్ కూడా పంజాబ్‌లో కోలుకోలేని స్థితికి చేరుకుంది. పంజాబ్‌లో బీజేపీ ఉనికి పెద్దగా లేదు. దీంతో రైతుల ఉద్యమ ప్రభావం అకాలీదళ్‌పై పడింది. బీజేపీతో తెగదెంపులు చేసుకున్నప్పటికీ అప్పటికే ఆ పార్టీకి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

సన్నిహితంగా ఉన్న పార్టీలదీ అదే స్థితి

2019 నుంచి 2024 వరకు రాజ్యసభలో ఎన్డీయేకు తగినంత మెజారిటీ లేదు. దీంతో బిల్లులు పాస్ చేయించుకోవడానికి బీజేడీ, వైఎస్సార్సీపీ మద్దతు బీజేపీకి కీలకంగా మారింది. ఆ పార్టీలు కూడా బీజేపీతో సఖ్యతతో వ్యవహరించాయి. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలోనే ఈ రెండు పార్టీలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఒడిశాలో బీజేడీని బీజేపీ ఓడించింది. ఏపీలో టీడీపీతో కలిసి వైసీపీని ఓడగొట్టింది. తాజాగా మత కోణం ఆధారంగా వైసీపీని కోలుకోలేని విధంగా దెబ్బ తీసేందుకు బీజేపీ ఐటీ వింగ్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నదనని వార్తలు వస్తున్నాయి. ఈ పార్టీల పరిస్థితి చూస్తున్న రాజకీయ విశ్లేషకులు బీజేపీతో స్నేహం ధృతరాష్ట్ర కౌగిలి లాంటిదని అభిప్రాయపడుతున్నారు.

ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ దారుణ హత్య

- ముసుగులు ధరించి దుండగుల కాల్పులు
- తమ పనేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్
- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- హుటాహుటిన దవాఖానకు సల్మాన్ ఖాన్

ముంబై, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎన్సీపీ(అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, బాంద్రా మాజీ ఎమ్మెల్యే బాబా సిద్ధిఖీ దారుణ హత్యకు గురయ్యారు. శనివారం ముంబయి బాంద్రాలోని ఆయన కుమారుడు, ఎమ్మెల్యే జీశాన్ సిద్ధిఖీ కార్యాలయం వద్ద ఈ ఘటన జరిగింది. దసరా సందర్భంగా కార్యాలయం బయట కొందరు టపాసులు కాలుస్తుండగా ముఖానికి గుడ్డలు కట్టుకుని బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు తుపాకులతో కాల్పులు జరిపారు. గుండెకు తూటా తగలడంతో గాయపడిన సిద్ధిఖీని హుటాహుటిన లీలావతి దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ హుటాహుటిన దవాఖానకు చేరుకున్నారు. ఈ హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వారిగా విచారణలో తేలింది. సిద్ధిఖీని చంపేందుకు ఒక్కో నిందితుడికి లారెన్స్ గ్యాంగ్ రూ. 50 వేలు అడ్వాన్స్ ఇచ్చిందని, అలాగే మారణాయుధాలు సైతం సమకూర్చినట్లు పోలీసులు తెలిపారు. బాబా సిద్ధిఖీకి 15 రోజుల క్రితమే ఆయనకు వై కేటగిరీ భద్రత కల్పించినట్టు పోలీసులు పేర్కొన్నారు.

ఎవరీ బాబా సిద్ధిఖీ?

దాదాపు 48 ఏండ్ల పాటు కాంగ్రెస్‌లో పనిచేసిన బాబా సిద్ధిఖీ, ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం)లో చేరారు. బాబా సిద్ధిఖీకి రాజకీయ నాయకుడిగానే కాకుండా పెద్దయెత్తున రంజాన్ విందులు, ప్రైవేటు పార్టీలు నిర్వహించే వ్యక్తిగా ముంబయి వ్యాప్తంగా పేరుంది. సల్మాన్ ఖాన్‌కు బాబా సిద్ధిఖీ మంచి మిత్రుడు.

కఠిన చర్యలు తీసుకుంటాం:షిండే

సిద్ధిఖీ మృతికి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 'పారిపోయిన వ్యక్తి కోసం పోలీసు టీములు గాలిస్తున్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఆయన అన్నారు. బాబా సిద్ధిఖీ మరణంపై రాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఎక్స్‌లో స్పందించారు. 'నా సహచరుడిని, స్నేహితుడిని కోల్పోయాను. ఈ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నా. బాబా సిద్ధిఖీకి హృదయపూర్వకంగా నివాళులర్పిస్తున్నాను' అని పేర్కొన్నారు.

ఇది శాంతి భద్రతల వైఫల్యం

సిద్ధిఖీ హత్య శాంతి భద్రతల వైఫల్యమని విపక్షాలు ఆరోపించాయి. మహారాష్ట్ర సీఎం షిండే, హోం మంత్రులకు ఆ పదవుల్లో కొనసాగే నైతిక హక్కు లేదని, వారు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే డిమాండ్ చేశారు. బాబా సిద్ధిఖీ హత్యతో దేశం మొత్తం భయపడుతున్నదని ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని ఆయన ఆరోపించారు.

హత్య మేమే చేశాం: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్

సిద్ధిఖీని తామే హత్య చేసినట్టు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. తమకు వ్యక్తిగతంగా ఎవరితో శత్రుత్వం లేదని, అయితే ఎవరైతే గ్యాంగ్‌స్టర్ దావుద్ ఇబ్రహీంతో సంబంధాలు పెట్టుకుంటారో, ఎవరైతే సల్మాన్ ఖాన్‌కు సహాయం చేస్తారో వారి ఖాతాలను సరి చేస్తామంటూ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడిగా భావిస్తున్న శుభం రామేశ్వర్ లంకర్ ఫేస్‌బుక్‌లో పెట్టాడు. బాబా సిద్ధిఖీ హత్యకు కొన్ని నెలల నుంచే నిందితులు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఇదే గ్యాంగ్ 2024 ఏప్రిల్‌లో బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటిపై కాల్పులు జరిపింది. తమ ఆరాధ్య జంతువు కృష్ణ జింకను సల్మాన్ చంపడంతో వారు దాడి చేశారు. సిద్ధిఖీ హత్యతో సల్మాన్ ఇంటి వద్ద మరోసారి భారీగా భద్రత పెంచారు.

గుజరాత్‌లో 5 వేల కోట్ల డ్రగ్స్ సీజ్

గాంధీనగర్: గుజరాత్‌లో మళ్లీ పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. ఆదివారం రాష్ట్రంలోని అంకలేశ్వర్ పట్టణంలో రూ.5 వేల కోట్ల విలువైన కొకైన్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఢిల్లీ, గుజరాత్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఇక్కడి ఆవ్కార్ డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ ఆవరణలో 518 కిలోల డ్రగ్స్ పట్టుకున్నారు. దీనికంటే ముందు ఢిల్లీలో పోలీసులు చేపట్టిన రెండు వేర్వేరు ప్రత్యేక ఆపరేషన్స్‌లో 700 కిలోల డ్రగ్స్ బయటపడింది.

స్టార్‌షిప్ ప్రయోగం విజయవంతం

లక్ష్యాలు చేరిన బూస్టర్, స్పేస్‌క్రాఫ్ట్

టెక్సాస్, అక్టోబర్ 13: అంతరిక్ష పరిశోధనలలో మరో నూతన ప్రయోగం విజయవంతంగా ఆవిష్కృతమైంది. ఎలాన్ మస్క్ అధిపతిగా ఉన్న స్పేస్ ఎక్స్ చేపట్టిన 'స్టార్‌షిప్' ఐదో ప్రయోగం విజయవంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం టెక్సాస్ దక్షిణ తీరం నుంచి దీనిని ప్రయోగించారు. భారీ రాకెట్ ప్రయోగించగా అందులో రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసింది. అందులో మొదటి దశలో భాగంగా 121 మీటర్ల పొడవైన భారీ రాకెట్‌ను ప్రయోగించిన కొద్ది సేపటికే 71 మీటర్ల పొడవైన భారీ బూస్టర్ తిరిగి ల్యాంచ్‌పాడ్‌కు చేరి అందులో ఒదిగి కూర్చుంది. రెండో దశలో భాగంగా స్పేస్‌క్రాఫ్ట్ తన ప్రయోగాన్ని కొనసాగించి హిందూ మహాసముద్రంలో విజయవంతంగా దిగింది. చంద్రుడు, అంగారకుడిపై యాత్రలకు వీలుగా స్పేస్ ఎక్స్ వీటిని రూపొందించింది. ఈ ప్రయోగం ద్వారా తమ రెండు లక్ష్యాలు నెరవేరినట్టు స్పేస్ ఎక్స్ తెలిపింది.

ప్రయోగం విజయవంతం కావడంతో సిబ్బంది ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

గౌరీ లంకేశ్ కేసు నిందితులకు బెయిల్

ఘన స్వాగతం పలికిన హిందూ సంస్థలు

బెంగళూరు, అక్టోబర్ 13: జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసులో బెయిల్‌పై విడుదలైన నిందితులిద్దరికీ హిందూ అనుకూల సంస్థలు ఘన స్వాగతం పలికాయి. ఈ కేసులో నిందితులైన వాఘ్‌మోర్, మనోహర్ యాదవ్ జైలులో ఆరేండ్లు గడిపారు. వారికి బెంగళూరు సెషన్స్ కోర్టు ఈ నెల 9న బెయిల్ మంజూరు చేయడంతో పరప్పన అగ్రహార జైలు నుంచి 11న విడుదలయ్యారు. అనంతరం సొంత ఊరైన విజయపురకు చేరుకున్న వారికి స్థానిక హిందూ అనుకూల సంస్థలు పూల దండలు చేసి, కాషాయ శాలువాలు కప్పి, వేద మంత్రాలతో ఘన స్వాగతం పలికాయి. వారిని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్దకు, అనంతరం కాళికా ఆలయానికి తీసుకువెళ్లి పూజలు జరిపాయి. కాగా, ఈ కేసులో వీరితో పాటు మరో ఆరుగురికి కూడా బెయిల్ మంజూరైంది.

ఎస్సీ జాతీయ కమిషన్‌కు 47 వేల ఫిర్యాదులు

యూపీ నుంచే అధికం

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: గత నాలుగేండ్లుగా షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ)కు 47 వేల ఫిర్యాదులు అందాయి. అధికారులు తాజాగా విడుదల చేసిన డాటా ప్రకారం ఇందులో ప్రధానంగా దళితులపై దాడులు, భూమి, ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. ఈ మేరకు పీటీఐ సంస్థ సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు స్పందించి ఎన్‌సీఎస్‌సీ ఈ వివరాలను అందజేసింది. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ కిశోర్ మఖ్వానా మాట్లాడుతూ వీటిలో యూపీలో అత్యధికంగా ఎక్కువ ఫిర్యాదులు నమోదయ్యాయన్నారు. ఒక్కో రోజు కమిషన్‌కు 200 నుంచి 300 వరకు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని కొన్ని రోజుల్లోనే పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. తమకు వచ్చిన ఫిర్యాదులలో ఒక్కదానిని కూడా నిర్లక్ష్యం చేయలేదని, అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

గాజాపై బాంబుల మోత

29 మంది మృతి

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కొనసాగుతున్న పోరు రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతున్నది. గాజాలోని జబాలియా ప్రాంతంలో ఉన్న చరిత్రాత్మక శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ బలగాలు వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ ఘటనలో 29 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని ఇజ్రాయెల్ వైద్యులు శనివారం తెలిపారు. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్టు అంతర్జాతీయ సహాయ సంస్థలు చెప్తున్నాయి. ఇటీవలి కాలంలో జబాలియా, దాని సమీప ప్రాంతాల్లో పని చేస్తున్న తమ దళాలు డజన్ల కొద్దీ ఉగ్రవాదులను హతమార్చాయని, ఆయుధాలను గుర్తించడంతోపాటు సైనిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ దళాలు తెలిపాయి.

అధ్యక్షుడినైతే వాళ్లందరికీ ఉరే

అమెరికన్లను చంపిన వలసదారులపై ట్రంప్ ఆగ్రహం

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న డొనాల్డ్ ట్రంప్ వలసదారులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ఎన్నికల్లో తాను గెలిస్తే అమెరికా పౌరులను చంపిన వలసదారులకు మరణశిక్ష విధిస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. కొలరాడోలోని అరోరాలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ప్రమాదకరమైన నేరస్థులు ఆక్రమించుకున్నారని ఆరోపించిన ట్రంప్.. తాను అధ్యక్షుడినయ్యాక వలసదారులే లక్ష్యంగా నేషనల్ ఆపరేషన్ ఆరోరాను మొదలు పెడతానని చెప్పారు. అమెరికా పౌరులను, అధికారులను చంపిన వలసదారులకు ఉరి శిక్ష తప్పదని హెచ్చరికలు జారీ చేశారు.

9/11 తరహా దాడికి హమాస్ కుట్ర

న్యూయార్క్: గత అక్టోబర్ 7 నాటి దాడికి ముందు 9/11 తరహా దాడిని ఇజ్రాయెల్‌పై చేయాలని హమాస్ కుట్ర పన్నినట్లు వాషింగ్టన్ పోస్ట్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ కుట్రకు సంబంధించిన రికార్డులను హమాస్ కమాండ్ సెంటర్ నుంచి ఇజ్రాయెల్ దళాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తున్నది. ఇ రాన్ అధికారులతో హమాస్ నేత య హ్యా సిన్వార్ సంభాషణలను కూడా ఈ మేరకు గుర్తించారు. శనివారం న్యూయార్క్ టైమ్స్ పత్రిక పది సమావేశాలకు సంబంధించిన మినిట్స్‌ను పబ్లిష్ చేసింది.

'బాలాసోర్'ను గుర్తు చేసింది

- లూప్ లైన్‌లోకి వెళ్లి గూడ్స్‌ను ఢీ కొన్న 'భాగమతి'
- ట్రాక్ ధ్వంసంపై ఆధారాలు.. కుట్రపై ఎన్ఐఏ దర్యాప్తు

తమిళనాడులో ప్రమాదానికి గురైన ఎక్స్‌ప్రెస్ రైలు బోగీని తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: తమిళనాడులో శుక్రవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదం ఇటీవల జరిగిన అత్యంత భయానకమైన బాలాసోర్ (ఒడిశా) రైలు ప్రమాదాన్ని గుర్తు చేసింది. దీంతో రైల్వే ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్న ప్రశ్న మరోసారి తెర మీదకు తెచ్చింది. తాజా ప్రమాదంలో మైసూర్-దర్భంగ భాగమతి ఎక్స్‌ప్రెస్ లూప్ లైన్‌లోకి దూసుకెళ్లి అక్కడున్న గూడ్స్ రైలును ఢీకొట్టడంతో 12 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో 19 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నైకి సమీపంలో కవరైపట్టై రైల్వే స్టేషన్ వద్ద రాత్రి 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రైలు గమనం, రైల్వే సిగ్నల్స్‌పై 'డాటా లాగర్' పరికరం విడుదల చేసిన 'సిమ్యులేషన్ వీడియో' బయటకు వచ్చింది. ఈ వీడియోను పరిశీలించిన రైల్వే అధికారులు, నిపుణులు ఇది 2023 జూన్ 2న నాటి బాలాసోర్ రైలు ప్రమాదాన్ని పోలి ఉందని చెప్పారు. మెయిన్ లైన్‌లో వెళ్లేందుకే భాగమతి ఎక్స్‌ప్రెస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, అది అనూహ్యంగా లూప్ లైన్‌లోకి వెళ్లి..దానిపై ఉన్న గూడ్స్ రైలును ఢీ కొట్టిందని రైల్వే బోర్డు తెలిపింది. రైలు ప్రమాదం వెనుక కుట్ర జరిగిందన్న అనుమానాలు వ్యక్తం కాగా, దీనిపై 'ఎన్ఐఏ' దర్యాప్తు చేపట్టింది. పెద్ద సుత్తి లాంటి పరికరంతో రైల్వే ట్రాక్‌ను దెబ్బ తీసినట్టు కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయని, దెబ్బతిన్న ట్రాక్ వద్ద బోల్టులు, ఇతర భాగాలు లేకపోవటంపై ఎన్ఐఏ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ ప్రమాదానికి సిగ్నల్, రూట్ మధ్య అసమతుల్యతే కారణమని భావిస్తున్నట్టు దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ చెప్పారు.

రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్

తృటిలో తప్పిన ప్రమాదం

రైలు ప్రమాదాలే లక్ష్యంగా చోటు చేసుకుంటున్న కుట్రలపై ఆందోళన వ్యక్తమవుతున్నది. తాజాగా ఉత్తరాఖండ్‌లోని రూర్కీ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్ కనిపించటం తీవ్ర కలకలం రేపింది. గూడ్స్ రైల్ లోకో పైలట్ వెంటనే అప్రమత్తమవటంతో తృటిలో ప్రమాదం తప్పింది. లలాంఢౌర్-ధంధేరా స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం 6.35 గంటలకు ఈ ఘటన జరిగింది. గూడ్స్ రైలు స్టేషన్ సమీపానికి వస్తుండగా.. పట్టాలపై

గ్యాస్ సిలిండర్ పడి ఉండటాన్ని లోకో పైలట్ గమనించారు. వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. సిలిండర్‌ను ఘటనా స్థలానికి దూరంగా తీసుకెళ్లి పరిశీలించగా, అది ఖాళీదని తేలింది. స్థానిక పోలీసులు, జీఆర్పీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఆ ఐదెకరాల భూమి మాకొద్దు

ఖర్గే కుమారుడి లేఖ

బెంగళూరు, అక్టోబర్ 13: ముడా కుంభకోణంలో కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పీక ల్లోతు కూరుకుపోయి ఉన్న క్రమంలో కాంగ్రెస్ నేతలు అప్రమత్తమయ్యారు. పీసీపీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే కుమారుడు, సిద్ధార్థ విహార్ ట్రస్ట్ చైర్మన్ రాహుల్ ఎం ఖర్గే కీలక నిర్ణయం తీసుకున్నారు. మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్, రీసెర్చి సెంటర్ ఏర్పాటు చేయడానికి తమ ట్రస్ట్‌కు బెంగళూరులో ఐదు ఎకరాలు కేటాయించాలంటూ కోరుతూ గతంలో చేసుకున్న దరఖాస్తును ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు కర్ణాటక ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ)కి లేఖ రాశారు. ఖర్గే కుటుంబానికి చెందిన ఈ ట్రస్ట్‌కు గతంలో కేఐఏడీబీ ఐదే ఎకరాల స్థలం కేటాయించగా, దానిని విపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. ఇప్పటికే ముడా భూ కుంభకోణం కేసులో సీఎం సిద్ధ రామయ్య భార్య పార్వతి గతంలో తనకు కేటాయించిన 14 స్థలాలను వెనక్కి ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా, ఖర్గే కుమారుడికి ఇలా భూమి కేటాయించడం అధికార దుర్వినియోగం, బంధుప్రీతికి పాల్పడటమేనని బీజేపీ ఎంపీ లాహర్ సింగ్ సిరోయా విమర్శించారు.

ఆదివారం కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ల నిరాహార దీక్షకు మద్దతుగా తరలివచ్చిన జనం

జూనియర్ డాక్టర్ల నిరసన ఉధృతం

9వ రోజుకు చేరిన ఆమరణ నిరాహార దీక్ష • రాజీనామాకు సిద్ధమైన 77 మంది వైద్యులు

కోల్‌కతా, అక్టోబర్ 13: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళన పతాక స్థాయికి చేరుకుంది. వారు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం 9వ రోజుకు చేరుకుంది. కోల్‌కతా, సిలిగురి నగరాల్లో ముగ్గురు జూనియర్ డాక్టర్ల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. తమ ఆందోళనపై సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ సర్కార్ స్పందించటం లేదని నిరసన చేపట్టిన వైద్యులు ఆరోపించారు. ఆందోళన చేస్తున్న జూడాలు ఆదివారం 'ఆరంధన్' (వంటవద్దు)కు పిలుపునివ్వగా, రాష్ట్రంలో పలుచోట్ల వారికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. వైద్యుల నిరసనకు సంఘీభావం తెలుపుతూ, 12 గంటలపాటు నిరాహార దీక్షను పాటించారు. ఆర్‌జీ కర్ దవాఖాన వైద్యులు సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానాల్లో పని చేస్తున్న వందలాది మంది వైద్యులు జూనియర్ డాక్టర్ల దీక్షకు తమ మద్దతు ప్రకటించారు. తాజాగా మరో 77 మంది వైద్యులు మూకుమ్మడి రాజీనామాకు సిద్ధమయ్యారు. అయితే వైద్యుల సామూహిక రాజీనామాలను మమత సర్కార్ తిరస్కరించింది. సామూహిక రాజీనామాల్ని ఆమోదించటం లేదని సీఎం ముఖ్య సలహాదారు అలపాన్ బందోపాధ్యాయ తెలిపారు.

ఎంపిక చేసుకున్న సేవల షట్ డౌన్‌కు పిలుపు

సోమవారం నుంచి దేశ వ్యాప్తంగా దవాఖానల్లో ఎంపిక చేసిన సేవలను షట్ డౌన్ చేయాలని ది ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్(ఫైమా) పిలుపునిచ్చింది. అయితే ఎమర్జెన్సీ సేవలను మాత్రం కొనసాగించాలని ఆ సంఘం రెసిడెంట్స్ డాక్టర్స్ అసోసియేషన్లను కోరింది. జూనియర్ డాక్టర్ల దీక్షకు ఫైమా మద్దతు ప్రకటించగా, ఈ నెల 15న ఒక రోజు దేశవ్యాప్త నిరాహార దీక్షకు ఐఎంఎ పిలుపునిచ్చింది.

కేరళ గవర్నర్, సీపీఎం మధ్య మాటల యుద్ధం

తిరువనంతపురం : కేరళలో అధికారంలో ఉన్న సీపీఐ(ఎం), గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. రెండు రోజుల క్రితం తనను 'కేర్ టేకర్ గవర్నర్'గా పేర్కొన్న సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ గోవిందన్‌ను అప్రాధాన్య వ్యక్తిగా గవర్నర్ అభివర్ణించారు. తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏ విషయాన్ని అయినా తాను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తోనే నేరుగా వ్యవహరిస్తానే తప్ప ఇలాంటి 'జానీ'లతో కాదని గోవిందన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గోవిందన్ విమర్శలు చూస్తుంటే రాజ్యాంగం పట్ల ఆయనకు ఉన్న అవగాహన ఏమిటో అర్థమవుతున్నదని అన్నారు. కాగా, రాష్ట్రంలో జరుగుతున్న దేశ వ్యతిరేక కార్యకలాపాలపై తనకు నివేదిక ఇవ్వాలంటూ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు గవర్నర్ సమన్లు జారీ చేయడంతో ఇది మరింత తీవ్రమైంది.

వానరులుగా నటించి జైలు నుంచి పరారీ

హరిద్వార్‌లో ఖైదీల తెలివి

*డెహ్రాడూన్: రామ్‌లీలా నాటకంలో భాగంగా వానరులుగా నటించిన ఇద్దరు ఖైదీలు నిచ్చెన సాయంతో గోడ దూకి జైలు నుంచి పరారయ్యారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్